# ఫిబ్రవరి 30

—శరచ్చంద్ర




'రాధమ్మ కూర తరుగుతు ంటే-

ఆమె కెదురుగా ముక్కాలి పీట మీద కూర్చుని "ఆహా! ఏమి నా భాగ్యం! ఎంత చక్కనిదీ పిల్ల! ఏ జన్మ పుణ్య ఫలమో కదా నా భార్య అయింది! చివర్లో కాస్తంత వంగి ఆకాశాన్ని చూస్తున్నట్టున్న ఆ ముక్కు సంపెంగే కదా!" అని పది వేల తొంభై తొమ్మిదోసారి అనుకుంటూ, అరమోడ్పు కన్నులతో పేపర్ చదవడం కూడా మానేసి ఆమె వంకే చూస్తున్న గోపాలం "హలో ... హలో ... మొత్తం ఇరవై" అంటూ విన వచ్చిన మాటలకు అదిరిపడ్డాడు—

పెదిమలు బిగించి కోపాన్నభినయిస్తూ, చూసీ చూడనట్టు దొంగ చూపులు చూస్తున్న రాధమ్మ ఉలిక్కిపడింది.

'బాణం వేసి కూరల బుట్టలో బీరకాయని కొట్టేద్దామా లేక నాన్న కొత్తగా కొన్దెచ్చిన బెల్జియం అద్దాన్ని కొట్టేద్దామా?' అని విల్లు నెక్కుపెట్టి మీమాంసలో పడ్డ శంకరం జడుసుకోవడంతో వాడు, వాడి విల్లమ్ములు అదిరిపోవడం జరిగింది.

అంత దూకుడుగా వచ్చినవాడు అప్పారావు.

దూకుడుగా రావడం, బోల్డంత నవ్వేసి, రాధమ్మిచ్చిన కాఫీ త్రాగేసి, శంకరంగాడి బుగ్గ మీద రెండు చిటికలేసి, గోపాలం జేబులో నుంచి అంది వంత స్వతంత్రంగా పుచ్చేసుకుని, సాయంకాలానికి ఫిరాయించేస్తానంటూ నిమిషాల్లో పిచ్చికలా ఎగిరి పోవడం అతని ప్రత్యేకత.

'అబ్బే - ఏమి లాభం లేదబ్బాయ్' అన్నాడు గోపాలం అదుర్నుండి తేరుకుంటూ—

'అమ్మమ్మ - నీవే అట్లా అంటే ఎట్లా చెప్పు - ప్రొద్దున్నే ఓ గుక్క కాఫీ అన్నా తాక్కుండా, ఓ సిగరెట్ దమ్మన్నా కొట్టకుండా వచ్చేశాను - నీవు బోణీ చేయకపోతే బావుండదు' అన్నాడు ఫాస్ట్‌గా అప్పారావు గోపాలాన్ని హాల్లోకి లాక్కుపోతూ—

"అది కాదురా తుకారాం-ఎంతకాలం ఇలా లోకం మీద పడి బతుకుతావు చెప్పు. హాయిగా పెళ్ళి చేసుకోక. మా మేనత్త కూతురుగారి మనవరాలు ఒకమ్మాయి వుందట. వస్తావా చూసొద్దాం" అంటూ కాస్త బుజ్జగిస్తున్నట్టు మాట్లాడుతూ, ఎప్పుడూ పాడే పాట మొదలెట్టాడు గోపాలం.

"ఇది చాలా దా'బుణ'మోయ్ — ఎన్నిసార్లిట్లా అరిగిపోయిన రికార్డ్ పెడ్తావు చెప్పు. అయినా అదట్లా వుంచు - అర్జెంటుగా ఇరవై హలోలిలా పడేయ్. నీ కెందుకు ఫిబ్రవరి 30 న నీకు ఫిరాయించెయ్యకపోతే నా పేరు 'పురాప్పాల' అని పెట్టెయ్" అంటూ చాలా జాలిగా, దీనంగా మాట్లాడి అక్కడే కొక్కేనికి వేలాడుతున్న గోపాలం చొక్కా జేబులో నుంచి ఓ వంద రూపాయిలను తన జేబులోకి బదిలీ చేసి ఆనందంగా ముఖంమింత చేస్కొని, ఓ విశాలమైన నవ్వు విసిరి, రాధమ్మిచ్చిన కాఫీ ఒక గుక్కలో త్రాగేసి, శంకరంగాణ్ణి గాల్లోకెగరేసి రెండు ముద్దులు పెట్టుకుని వచ్చినంత వేగంగా వెళ్ళిపోబోయాడు.

> **సంతకం**
>
> "ఎక్కడికి ప్రయాణం?"
>
> "పల్లకాట్లోకి!"
>
> "అయితే కొంచెం ఆగు."
>
> "ఎందుకు?"
>
> "తెల్ల కాయితం తెస్తా - కాస్త సంతకం చేసి వెళ్దువుగాని!"
>
> — పట్టబాబు, కొత్తగూడెం కాలనీ

'అబ్బాయ్' నువ్వా డబ్బులు అన్నట్టుగా ఈ నెల ముప్పయిన ఇయ్యకపోయావో నీతో జన్మలో మాట్లాడనంతే అంటూ బెదిరించాడు గోపాలం.

"భలేవాడివిలే - మనుషుల మీద మరీ అంత నమ్మకం లేకపోతే ఎట్లా చెప్పు. అరే - గోల్డ్ ఫ్లేక్ కింగ్ సైజ్ సిగరెట్లే — బ్రాండ్ ఎప్పుడు మార్చావురా" అంటూ ఆ సిగరెట్ పెట్టెను కూడా తన జేబులోకి తోసేసి "పాపం అగ్గిపెట్టె నీ దొద్దులే - కిళ్ళీ కొట్లో అప్పెట్టి తీస్కుంటా" అంటూ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లా వెళ్ళిపోయాడు.

"వెధవ - ఎప్పుడూ ఇంతే. ఊపిరి ఆడనిస్తేనా?" అంటూ మొదలెట్టబోయాడు గోపాలం, తను వంటింట్లోకి రావడంతో విసురుగా తలనటు త్రిప్పు కున్న రాధమ్మతో తన తప్పేమి లేదన్నట్టు.

"ఎంత వల్చుకు పోయాడేమిటి?" ముఖం గంటుపెట్టుకుని అడిగింది రాధమ్మ—

"అబ్బే ఎంత - ఇరవై హలోలే. అదే - వంద రూపాయలే - మళ్ళీ ఈ నెల ముప్పయి కిచ్చేస్తా నన్నాడు" అన్నాడు గోపాలం నమ్మకంగా—

ఆ మాటలకు రాధమ్మ త్రుళ్ళి త్రుళ్ళి నవ్వ సాగింది —

వారి సంధించి రెడీగా నిలబడ్డ శంకరం వాళ్ళిద్దరి వంక విచిత్రంగా చూసి మళ్ళీ తన పనిలో లీన మయ్యాడు.

"ఏం - వేనిప్పుడేం జోకేశానని అంతగా నవ్వడం? వాడు నిజంగానే ఇచ్చేస్తాడు తెల్సా - ఇంతకు ముందు నాకు రెండుసార్లో, మూడుసార్లో ఇచ్చేశాడు కూడా" అన్నాడు గోపాలం ముఖాన్ని కొత్తగా వచ్చిన పది పైసలంత చేస్కొని, తను ఏ ఇరవై సార్లో, ముప్పయి సార్లో డబ్బులు ఇచ్చాడన్న విషయాన్ని చెప్పకుండా—

"హ ... హబ్బే ... హది కాదని ... మీహిరిచ్చి న్డబ్బులు ర్ధామార్పణం - ఏ సంవత్సరంలోనైనా ఫి...ఫిబ్రవరి నెలకు ఇరవై తొమ్మిది రోజులేగా" అంది రాధమ్మ నవ్వుని బిగపెట్టలేక అవస్తపడ్తూ.

'ఓరీడి దుంపతెగా! ఈస్త్రానీ - వీడంతు మాస్తా' అనుకున్నాడు గోపాలం మనసులో — హాల్లో కెళ్ళిపోయి —

('ముళ్ళపూడి'గారి రచనల్ని అనుకరించాలని సరదాగా చేసిన పేరడీ యిది — ఆయన అనుమతి లేకుండా, వారి కుటుంబంలోకి చొప్పుకెళ్ళినందుకు క్షమించమని వేడు కుంటూ — శరచ్చంద్ర)